(మూర్ఖులు తమ మూర్ఖత్వాన్ని దాచిపెట్టుకోడానికి మౌనాన్ని సృష్టించాడు విధాత. పండితుల మధ్య వాళ్లు మౌనంగా ఉండటమే పెద్ద అలంకారంగా ఉంది కాబట్టి.. వాళ్లు మాట్లాడక పోవడమే మంచిది)''

అందరూ నవ్వారు. సాధారణంగా విద్యావంతులందరూ సంస్కృత భాషీయులే. అర్థం చేసుకోగలరు.

''అయితే మూర్ఖుడిని కాబట్టి మౌనంగా ఉన్నానంటావ్!?'' నవ్వుతూ అన్నాడు రుద్రయ.

జాయపునిది.. అదే చిరు మందహాసపు మౌనం!

మందిరమంతా ఆ రాత్రి అలాంటి అద్భుత యుద్ధఘట్టాలతో.. ముచ్చట్లతో.. నవ్వులతో పరిమళించింది.

అందరితో కలిసి నవ్వినా.. జాయపుణ్ని గజచమూపతిగా నిర్ణయించి ప్రకటించడం నచ్చనివాడు ఒక్కడే.. అతను ప్రసాదిత్యుడు!! పద్మనాయక బేతాళ నాయకుని రెండో కుమారుడు.. మంచి యువవీరుడు.

మరునాడు ఓ జాము సమయం ప్రసాదిత్యుడు మరొకరితో మంతనాలు సాగించాడని.. ఇక్కడ జరిగింది మరొకరికి వివరించి హెచ్చరించాడని ఈ సమావేశ పెద్దలకు తెలియదు.

''ముసలితొత్తులంతా వాణ్ని పైకెత్తుతున్నారు. భవిష్యత్తులో కాకతీయ సామ్రాజ్యానికి జాయపుడే పెద్ద శత్రువు కాగలడు. తస్మాత్ జాగ్రత్త!!''..

* * *

జాయపసాహిణి సారథ్యంలో కాకతీయ గజదళం శత్రు దుర్భేద్యం అవుతున్నది.

కొమురయను కూడా తనతోనే ఉంచుకున్నాడు జాయపుడు. సుబుద్ధి తదితర ఆత్మీయులంతా రాత్రింబవళ్లూ గజశిక్షణ ప్రాంగణంలోనే ఉంటున్నారు.

తగిన సహచరుల బృందాన్ని ఏర్పాటు చేసుకున్న జాయపుడు.. ఇప్పుడు తిరిగి యుద్ధకాండలో మరో ముఖ్యపార్శ్వంపై దృష్టిపెట్టాడు. అది సైనికులను యుద్ధానికి మానసికంగా సమాయత్తం చేయడం.

యుద్ధకాలంలో సైనికులే కాదు.. సాధారణ ప్రజల్లో కూడా యుద్ధావేశం చాలా ఉధృతంగా ఉంటుంది. కానీ, సైన్య పారావారం కదిలే నాటికి సైనికుల్లో యుద్ధభయం ఏర్పడుతుంది. పిరికితనం నరనరానా పాకుతుంది. అప్పుడు వారికి మరింత ప్రేరణ కావాలి. అదే ఎలా అని తీవ్రంగా యోచిస్తున్నాడు జాయపుడు.

గతంలో వీరరసం ప్రధానంగా రూపకల్పన చేసిన ప్రేరణ నాట్యాన్ని యుద్ధ సంసిద్ధత కోసం మరింత మెరుగుపరచాలన్న ఆలోచన కలిగింది.

తక్షణమే భైరవ, కొండయ బృందాన్ని పిలిపించి తన పురనివాసంలోనే ఉంచి వారితో ప్రేరణ నాట్యంలో విభిన్న ప్రయోగాలు మొదలెట్టాడు. నృత్తానికి సంగీతం ప్రధానం కావడంతో.. వివిధ వాద్యాలు, వాటి విలక్షణత.. అవి ఎలా నృత్తానికి సహాయపడుతున్నాయో ఇటీవల పరిశీలిస్తున్నాడు జాయపుడు. అలా అతని అన్వేషణలో ఓ మృదంగం.. తాండవాన్ని మరింత ఉధృతస్థాయికి తీసుకువెళ్లగలదని అతని దృష్టికి వచ్చింది. గతంలో రామప స్థపతి కూడా కొందరు మృదంగ విద్వాంసులను పిలిపించి వారు వాయిస్తుండగా పలికే శబ్ద స్థాయిని బట్టి శిల్ప నిర్మాణం చేశారు. వాళ్లు కళింగరాజ్య జానపద ప్రదర్శనకారులు. ఆ మార్దంగికులను పిలిపించి ప్రేరణ ప్రదర్శనకు వాద్యాన్ని అనుసంధానం చేశాడు. అలాగే కరణాంగ హార భావప్రకటనా నర్తనంలో మరింత ఉధృతి పెంచి.. మరింత ప్రతిభావంతం చేశాడు.

నర్తకులు తమ శరీరంలోని అంగ, ప్రత్యంగ, ఉపాంగాల ద్వారా ఆయా రసాలను ప్రదర్శించవచ్చు. శరీరంలోని ప్రతికండరం ఈ నవరసాలను ప్రదర్శించే విధంగా వారికి శిక్షణ ఇవ్వడం ప్రారంభించాడు. కేవలం ఒక రస స్థాయినే కాకుండా.. అందులో వచ్చే వివిధ సంచారాలను కూడా మృదంగ వరుసలు, జతులు, యతులు మొదలైన శబ్ద సంపద సహాయంతో ప్రదర్శన రక్తికట్టేలా చాలా అపూర్వంగా రూపొందించాడు.

ఈ ప్రేరణను ఏకవ్యక్తి నృత్తంగా జాయపుడు చెప్పిన దానికంటే వందరెట్లు అబ్బురంగా చేస్తున్నవాడు భైరవ.

ఆ బృందంలోని ముఖ్యులంతా ప్రేరణ నాట్యబృందంగా మారిపోయారు. బృందం ఏ ఊరిలో ప్రదర్శన ఇచ్చినా ఊరు ఊరంతా ఉద్రేకంతో ఊగిపోతున్నదని.. జనం తండోపతండాలుగా తరలివచ్చి ఉద్రేకంతో.. 'జై హరహరమహా దేవా.. జై గణపతిదేవా..' లాంటి జయ జయ ధ్వానాలతో రెచ్చిపోతున్నారని అందరూ చెప్పుకొంటున్నారు. మరోవైపు జాయపుడు, కాకతి చేస్తున్న జంట లాస్య, తాండవ నాట్యాలు కూడా ప్రజల్లో ఎంతో ఆదరణ పొందుతున్నాయి. అటు శిల్పశాలలో సజీవ ప్రతీకగా శిల్పసృష్టికి ఊతమిస్తూ, ఇటు గురుకులంలో నాట్య, వాద్య, గీత పరిశోధన చేస్తూ, ఇక్కడ తన పురనివాసంలో నాట్య ప్రయోగాలు చేస్తూ, జాయపుడు కాకతీయ కళాప్రేరణలో ప్రధాన భూమిక పోషిస్తూ నాట్యాన్ని ప్రజాహితం.. రాజ్యహితం చేస్తున్నాడు.

* * *

> **యుద్ధకాలంలో సైనికులే కాదు.. సాధారణ ప్రజల్లో కూడా యుద్ధావేశం చాలా ఉధృతంగా ఉంటుంది. కానీ, సైన్య పారావారం కదిలే నాటికి సైనికుల్లో యుద్ధభయం ఏర్పడుతుంది. పిరికితనం నరనరానా పాకుతుంది. అప్పుడు వారికి మరింత ప్రేరణ కావాలి. గతంలో వీరరసం ప్రధానంగా రూపకల్పన చేసిన ప్రేరణ నాట్యాన్ని యుద్ధ సంసిద్ధత కోసం మరింత మెరుగుపరచాలన్న ఆలోచన కలిగింది జాయపునికి.**

అటు గజతంత్రం.. ఇటు ప్రేరణ నృత్త తంత్రం!

ఈ సమయంలో స్థపతి రామప వచ్చి మరో శిల్పప్రయోగం ఆలోచన వచ్చిందని చెప్పి అందులో పాల్గొనవల్సిందిగా జాయపుణ్ని కోరాడు.

''తప్పకుండా శిల్పదేవా.. రేపే కర్మశాలకు వస్తాను!''.

''ఆ.. కాకతిని తీసుకురావడం.. మర్చిపోవద్దు సుమా!''.

''ఆమె ఈమధ్య గుడిసానిగా పూర్తి స్వామిభక్తిలో మునిగి తేలుతూ స్నేహభక్తిని కూడా మర్చిపోయింది. తప్పక కబురు పెడతాను. రేపు లేకుంటే ఎల్లుండి ఇద్దరం తప్పక హాజరవుతాం.. సరేనా?!''.

రామప స్వయంగా వచ్చి అడిగారని కబురు పెడితే కాకతి కూడా స్పందించింది. ఇద్దరూ శిల్ప కర్మశాలకు హాజరయ్యారు.

ఈసారి అక్కడున్న బృందాన్ని చూసి ఆశ్చర్యపోయారు ఇద్దరు. కారణం.. అక్కడొక సంగీత వాద్యకారుల బృందం ఉంది. జాయపునికి ఆ బృందం పరిచితులే కానీ ఎందుకు వచ్చారో తెలియక ఆశ్చర్యపోయాడు.

రామప చెప్పాడు..

''నేను, సంజయ ఓ కొత్త ఆలోచన చేశాం జాయపా! ఇంతకాలం మనం నాట్య భంగిమలు, రకరకాల అంశాలు శిల్పాల రూపంలోకి మలిచాం. ఇప్పుడు వాద్య సంగీతాన్ని కూడా శిల్పాలలో బంధించాలని కొత్త ఆలోచన. దానికి నీ అభిప్రాయాలు కూడా జోడించాలి. చెప్పు.. ఎలా చేస్తే బావుంటుందో!?''.

వారి ఆలోచన జాయపునికి చాలా నచ్చింది. నిజానికి సంగీతంలో, ముఖ్యంగా వాద్యసంగీతంలో ఎంతో పరిశోధన చేస్తున్నాడు. గురుకులంలో ఈ అంశంపై సంగీత విద్యార్థులతోనూ, సంగీత గురువులతోనూ చేస్తున్న పరిశోధనాంశాలు ఎప్పటికప్పుడు రాసి పెట్టుకుంటాడు కూడా.

వీళ్లు ఈ శిల్పాలలో కూడా నాట్యంతోపాటు సంగీతాన్ని బంధించేలా చెక్కడం.. అందుకు తననే ఎంచుకోవడం కూడా అతనికి మంచి ఆసక్తిని రేకెత్తించింది. మృదంగంపై విద్వాంసులు వాయిస్తుండగా.. ఇద్దరూ తీక్షణంగా పరిశీలించారు. ఆనక వారి మెడల్లో మృదంగం తగిలించి విద్వాంసులు ఎలా చేతివేళ్లు కదిపారో అదే సమయంలో మెడ, నడుము, కాళ్లు ఎలా వంచారో.. ముఖ భంగిమలు ఎలా ఉంచారో.. అలా కాకతి, జాయపుడు ప్రవర్తించారు. అవి చూస్తూ శిల్పులు శిల్పం ప్రారంభించగా.. సంజయ బిరుసు గుడ్డపై గంటం చేబూని చిత్రీకరణ ప్రారంభించాడు.

ఈ ప్రయోగం వారంరోజులపాటు కొనసాగింది. తర్వాత సన్నాయి, జంత్రవాద్యం.. లాంటి వాద్యాలపై ఉంచిన చేతులను చూస్తే నిజంగానే వాళ్లు వాయిస్తున్నప్పుడు, వాయిస్తున్న తీరులో నాదోత్పత్తి, పూరణ ఉన్నాయన్న భావన ఆ శిల్పులలోనే కలుగుతున్నది.

''నిజంగా ఇదొక గొప్ప ప్రయోగం. ఆగామి యుగాలలో ప్రజలు మిమ్మల్ని తప్పక తలుస్తారు జాయపా!'' అన్నాడు రామప.

''అది మీ ఆలోచనామృతం శిల్పదేవా! ఆ అభినందనకు మీరే పూర్తి అర్హులు..'' అంటూ అక్కడున్న భంగిమలు చిత్రించిన బిరుసువస్త్ర పొత్తాన్ని చూస్తుండగా.. నగ్నభంగిమల చిత్తరువులు కంటపడ్డాయి.

''అరె.. ఇవేమిటి!?''.

అవి జాయపుడు, కాకతిల భంగిమలే!

కానీ, పూర్తి నగ్నంగా కామక్రీడలో ఉన్నట్లు చిత్రితమై ఉన్నాయి. చాలా ఆశ్చర్యపోయాడు జాయప.

''మనం గతంలో అనుకున్నాం కదా జాయపా! దేవాలయాలపై కామశిల్పాలు కూడా చిత్రీకరించాలని. అందుకు కొన్ని ఉదాహరణలు మీ భంగిమలనుంచి ఊహాత్మకంగా లిఖించాడు సంజయ!''.

''అవి మీరు దుస్తుల్లో ఉండగా చిత్రీకరించినవే! మీ శరీరాలు అందుకు అద్భుతమైన నమూనాలుగా తోచి ఇలా ఊహ చేశానన్నమాట!''.. సంజయ మరింత వివరించాడు.

కొంత అసభ్యంగా ఉన్నా.. ఈ కామక్రీడ చిత్రీకరణ గతంలో రామప రాతిబండవద్ద చర్చించిందే.

కాకతి వాటిని తొంగి చూస్తున్నట్లు గుర్తించి.. గబగబా ఆ పొత్తాన్ని మూసేసి పక్కన పెట్టేశాడు.

స్త్రీ పురుష మార్దాంగికులు, ఇతర సంగీత వాద్యకారులు, దండరావకం, మరికొన్ని వాద్యసమ్మిళిత క్రీడలు.. మరికొన్ని మిథున శృంగార భంగిమల శిల్ప చిత్రీకరణ మరో పక్షంరోజులు జరిగింది.

ఈ మధ్యలో ఓరోజు అనుకోకుండా ఆమె పల్లకిబోయలు ఇద్దరు రాలేకపోయారు. కాకతి తన అశ్వం అధిరోహించడానికి జాయపుడు సంశయించినా.. ఆమె సంశయించలేదు. అధిరోహించింది. ఇద్దరూ ఓ అశ్వంపై వెళ్లడం ఇద్దరికీ కొత్త అనుభవం. ▪

**(సశేషం)**